సాక్షి
కామారెడ్డి
గురువారం । 24 । జూలై । 2025



అందుబాటులో ఉండి..

దేవునిపల్లి పీహెచ్‌సీలో అందుబాటులో లేని డిప్యూటీ డీఎంహెచ్‌వో, మెడికల్ ఆఫీసర్లకు షోకాజ్‌లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో ▸



కృత్రిమ కొరత సృష్టిస్తే..

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. బుధవారం పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /22.7

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అప్పుడప్పుడు, అక్కడక్కడ చిరుజల్లులనుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

‘పఠన సామర్థ్యాలను పెంపొందించాలి’



కామారెడ్డి టౌన్: విద్యార్థులలో పఠన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి రిసోర్స్ ఉపాధ్యాయులకు గ్రంథాలయ నిర్వహణ అన్న అంశంపై బుధవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థుల గురించి కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయ పీరియడ్ నిర్వహించాలని, విద్యార్థులకు ప్రతిరోజు పుస్తకాలు చదవడానికి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు నాగవేందర్, కృష్ణ చైతన్య, రిసోర్స్ పర్సన్స్ హరిప్రసాద్, యేసు రత్నం పాల్గొన్నారు.

‘విండోల సేవలు ప్రశంసనీయం’



భిక్కనూరు: రైతులకు సేవలు అందించడంలో సింగిల్ విండోల పాత్ర ప్రశంసనీయమని జిల్లా సహకార శాఖాధికారి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పెద్ద మల్లారెడ్డి సింగిల్‌విండోను సందర్శించి రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సింగిల్ విండోలు పనిచేస్తున్నాయని, వారికి అవసరమైన సేవలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన వెంట మానిటరింగ్ అధికారి సురేశ్, సీఈవో మోహన్ తదితరులున్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



నిజాంసాగర్: స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలతో పాటు సర్పంచ్ ఎన్నికలకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము గుప్తా, మండల అధ్యక్షుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సతీశ్




కామారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుడు కొడగంటి సతీశ్ ఎంపికయ్యారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈగ లింబారెడ్డి తెలిపారు. ఈనెల 24 నుంచి 30 వరకు చండీఘఢ్‌లో నిర్వహించే 72వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. బ్రాహ్మణపల్లికి చెందిన సతీశ్ దేమికలాన్ హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఆయన ఎంపికవడంపై టీజీపెటా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామిగౌడ్, అశోక్, దేమికలాన్, బ్రాహ్మణపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మత్తడికి అడ్డు పెట్టొద్దు

కామారెడ్డి క్రైం: భారీ వర్షాలు కురిసి చెరువు మత్తడి పైనుంచి నీరు ప్రవహించే సందర్భాల్లో మత్తడికి ఎలాంటి అడ్డు పెట్టరాదని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి పేర్కొన్నారు. సిమెంట్ దిమ్మెలు, ఇనుప జాలీలు, వలలను అడ్డుగా పెట్టకూడదని సూచించారు. అలా పెడితే చెరువులు, కుంటల కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంటుందని, నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల కూడలి!



నిజాంసాగర్ రోడ్ జంక్షన్ అభివృద్ధికి సంబంధించిన ప్లాన్ (ఫైల్)

- జిల్లాకేంద్రంలో అభివృద్ధికి నోచుకోని జంక్షన్లు
- పెరిగిన వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామ్‌లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రోడ్డు దాటడం సాహసమే అంటున్న పాదచారులు

కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత వాహనాల రాకపోకలు పెరిగాయి. రద్దీకి అనుగుణంగా రోడ్లను విస్తరించడం ఏమో గానీ కనీసం కూడళ్లను కూడా అభివృద్ధి చేయలేదు. దీంతో ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ సమయాల్లో రోడ్డు దాటడానికి పాదచారులు సాహసాలు చేయాల్సి వస్తోంది. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



నిజాంసాగర్ చౌరస్తా వద్ద కష్టంమీద యూటర్న్ తీసుకుంటున్న బస్సు

జిల్లా కేంద్రంగా ఎదిగిన కామారెడ్డి పట్టణానికి రాకపోకలు పెరిగాయి. దీనికి తోడు నలువైపులా పట్టణం విస్తరిస్తోంది. వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నాలుగు రోడ్ల కూడలి అయిన నిజాంసాగర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి ఉంది. కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్, ఎల్లారెడ్డి, పిట్లం వెళ్లే బస్సులన్నీ నిజాంసాగర్ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకోవాల్సి ఉంటుంది. అక్కడ బస్సులను మలపడం అంటే సాహసంతో కూడుకున్న వ్యవహారం. బస్సును నేరుగా మలపడం సాధ్యం కాదు. ఒకసారి కొంత ముందుకు వెళ్లి తిరిగి రిటర్న్ తీసుకుని మరోసారి ముందుకు కదలాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఇతర వాహనాలు ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తుంటాయి. దీంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంటోంది. ఇక్కడ జంక్షన్ అభివృద్ధి కోసం గతంలో రూ. 1.22 కోట్లు మంజూరయ్యాయి. అయితే జంక్షన్ అభివృద్ధితో స్థలాన్ని కోల్పోయేవారు కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుపడడంతో నిధులను ఇతర పనులకు మళ్లించేశారు. దీంతో జంక్షన్ అభివృద్ధి అటకెక్కింది. అలాగే కొత్తబసాండ్ సనమీపంలోని అశోక్ నగర్‌చౌరస్తా వద్ద కూడా జంక్షన్ అభివృద్ధికి రూ. 78 లక్షలు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. ఇక్కడ కూడా రోడ్డు దాటడానికి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామారెడ్డి చౌరస్తా, సర్కార్ దవాఖానా చౌరస్తా, రైల్వే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లోనూ జంక్షన్లు ఇరుకుగా ఉన్నాయి.

పెరిగిన ట్రాఫిక్ కష్టాలు..

పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. ఇక్కడ నలువైపుల నుంచి వాహనదారులు దూసుకు వస్తుంటారు. జంక్షన్‌ను విస్తరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే బ్రిడ్జి నుంచి చౌరస్తా వద్ద రోడ్డు దాటి నిజాంసాగర్ రూట్‌లోకి వెళ్లడానికి వాహనదారుల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటు కొత్త బస్టాండ్ వైపు, అటు నిజాంసాగర్ వైపు వాహనాలు ఒకేసారి వెళ్లడం మూలంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిజాంసాగర్ రోడ్డు నుంచి పాత బస్టాండ్ వెళ్లడానికి వాహనాలు బల్దియా వద్దకు వచ్చి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. అక్కడ భారీ వాహనాలు ముఖ్యంగా లారీలు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందిరాచౌక్ వద్ద నాలుగు వైపుల నుంచి వాహనాలు రావడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అశోక్‌నగర్ చౌరస్తా వద్ద సిగ్నల్స్ పనిచేయక నెలలవుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఆయా కూడళ్లను అభివృద్ధి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఇరుకుగా ఉన్న ఇందిరాచౌక్ జంక్షన్

అభివృద్ధికి నోచుకోని ఇందిరా చౌక్

పట్టణ నడిబొడ్డున రైల్వే స్టేషన్ వద్ద ప్రధాన చౌరస్తాగా ఉన్న ఇందిరాచౌక్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. స్టేషన్‌రోడ్డు, అడ్లూర్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డుల కూడలితో పాటు రైల్వే స్టేషన్ కూడా ఉండడం వల్ల ఈ ప్రాంతం మీదుగా నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. అంతా జిగ్‌జాగ్‌గా ఉంటుంది. పాతబస్టాండ్‌వైపు నుంచి వచ్చే వాహనాలు స్టేషన్ రోడ్డుకు వెళ్లాలంటే చౌక్ చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అలాగే స్టేషన్‌రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు సిరిసిల్ల రోడ్డు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇబ్బందికర పరిస్థితి ఉంది. సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు రోడ్డుపై ఆగినప్పుడు వెనక నుంచి వచ్చే వాహనాలు దాటలేకపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది.

‘ఆర్టీసీ’లో ప్రయాణం సురక్షితం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకుని మహిళలు 200 కోట్ల సార్లు బస్సులలో ఉచితంగా ప్రయాణించి సుమారు రూ. 6,700 కోట్లు ఆదా చేసుకున్న సందర్భంగా బుధవారం కామారెడ్డి బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రోజూ ఉచిత ప్రయాణం చేసే మహిళలను సన్మానించి, బహుమతులు అందించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆరు స్పెషల్ టూర్ ప్యాకేజీల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్డీవో వీణ, డిపో మేనేజర్ కరుణశ్రీ, అసిస్టెంట్ మేనేజర్ మూర్తి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి సంబురాలలో పోచారం



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం నిర్వహించిన మహాలక్ష్మి సంబురాలలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా పేదలకు మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిపో మేనేజర్ సరితాదేవి, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు!

- పెరుగుతున్న డెంగీ కేసులు
- ఇద్దరిని బలిగొన్న వాంతులు, విరేచనాలు
- మరికొందరు ఆస్పత్రి పాలు



కామారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు



దేమికలాన్‌లో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ, పరిసరాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాను సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. ఇప్పటికే డెంగీ కేసులు పెరిగాయి. చాలాచోట్ల జ్వరాలతో ఆస్పత్రులకు వరుస కడుతున్నారు. తాజాగా వాంతులు, విరేచనాలతో ఇద్దరు చనిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పట్టణాలతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, నీరు కలుషితం కావడం వంటివి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి. ఇటీవల పాల్వంచ మండలం భవానీపేట తండాలో డెంగీతో పలువురు మంచం పట్టారు. మంగళవారం తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామంలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు చనిపోగా ముప్పై మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. చాలామంది కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ గ్రామాన్ని సందర్శించి, పరిస్థితిని తెలుసుకున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం..

జిల్లాలో జ్వరాలతో చాలా మంది మంచం పడుతున్నారు. చిన్న పిల్లలు ఎక్కువగా వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి పట్టణంలోని అన్ని ఆస్పత్రుల్లో రోజూ రద్దీ కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచే కాకుండా పట్టణానికి చెందిన వారు జ్వరాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. చాలామంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకుంటుండడంతో ఆ కేసులు లెక్కల్లోకి రావడం లేదు.

ఓ వైపు డెంగీ.. మరోవైపు విరేచనాలు..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. రెండు నెలల్లో యాభైకిపైగా డెంగీ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. అలాగే జ్వరాలు, వాంతులు, విరేచనాల కేసులూ ఎక్కువగానే ఉంటున్నాయి. చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. పట్టణాల్లో అయితే దోమలు దండయాత్ర చేస్తున్నాయి. తాగునీరు కూడా చాలాచోట్ల కలుషితమవుతోంది. దీంతో డెంగీతో పాటు విషజ్వరాలు, డయేరియా వంటివి ప్రబలుతున్నాయి. ఎక్కువ మంది మంచం పడితేగానీ విషయం బయటకు రావడం లేదు. దేమికలాన్‌లో ఇద్దరు చనిపోయిన తరువాతే సమస్య వెలుగు చూసింది. అక్కడ వారం పది రోజులుగా చాలా మంది జ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని, పలువురు ఆస్పత్రుల్లో చేరారని తెలిసింది.

సానిటేషన్‌పై దృష్టి సారించాలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇప్పటికే ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడడంతో పాటు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా చాలాచోట్ల ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. తాగునీటి పైపులైన్ల లీకేజీలు, ఇతర సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పల్లెలతో పాటు పట్టణాల్లోనూ సానిటేషన్‌పై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మురికి కాలువలు శుభ్రం చేయించడంతో పాటు చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దేమికలాన్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

డయేరియా కారణం కాదు..

దేమికలాన్‌లో ఇద్దరి మరణానికి డయేరియా కారణం కాదని ఆర్డీవో వీణ ఒక ప్రకటనలో తెలిపారు. 21న మరణించిన భూమయ్య కొంతకాలంగా కామెర్లు, ఇతర జబ్బులతో బాధపడుతున్నాడని విచారణలో తేలిందని పేర్కొన్నారు. స్వామి తన తండ్రి దినకర్మ సందర్భంగా మద్యం సేవించి, మాంసం తినడంతోపాటు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పత్తి పంటపై పురుగు మందు పిచికారి చేయడం వల్ల ఈనెల 22న మరణించాడని తెలిపారు. నీటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించామని పేర్కొన్నారు. గ్రామంలో డయేరియాతో బాధపడుతున్న 14 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.



దేమికలాన్‌లో పరిస్థితి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

‘ప్రజలు అప్రమత్తంగా ఉండాలి’



సంతాయిపేట్ భీమేశ్వర వాగును పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

తాడ్వాయి: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేశ్ సూచించారు. బుధవారం ఆయన సంతాయిపేట్ శివారులోని భీమేశ్వర వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు పంటపొలాలకు వెళ్లే సమయంలో, అవసరం నిమిత్తం వాగులు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు నీటి ప్రమాద ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై మురళి తదితరులున్నారు.

క్లుప్తంగా

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి



నస్రుల్లాబాద్: ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు నర్సింలు గౌడ్, అల్లం రాము, టేకుర్ల సాయి, వెంకటి, సాయి కుమార్, మోసీన్, దత్తు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమయానుసారం వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలి



పిట్లం(జుక్కల్): సమయానుసారం చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, తల్లిదండ్రులు సైతం బాధ్యతగా చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విద్య సూచించారు. ఆమె బుధవారం మద్దెలచెరువు, రాంపూర్ గ్రామాల ఆరోగ్య సబ్ సెంటర్లను సందర్శించారు. టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

బీఎంఎస్ జెండా ఆవిష్కరణ



నాగిరెడ్డిపేట/లింగంపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) 70వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌పేటలోని ఆటోస్టాండ్ వద్ద బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆటోవాలా సమస్యలపై పోరాడేందుకు బీఎంఎస్ ఎల్లవేళలా ముందుంటుందని ఆటో యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. అలాగే లింగంపేటలో బీఎంఎస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయాలి



గాంధారి: లింగంపేట మండల కేంద్రంలో శుక్రవారం జరిగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు.బుధవారం ఆయన గాంధారికి విచ్చేశారు. మండల కేంద్రంలోని షాదీఖానాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కేటీఆర్ సభకు కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి రావాలన్నారు. నాయకులు సి.సత్యం,మోహన్‌నాయక్, పత్తి శ్రీను, సాయిలు,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు పరిసరాలను బుధవారం ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి పరిశీలించారు. ఈ నెల 25న బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ఆత్మ గౌరవ గర్జన కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. గత ఏప్రిల్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఫ్లెక్సీ వివాదంలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలును బట్టలూడదీసి లాక్కెళ్లిన ఘటనకు నిరసనగా లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన సభను ఏర్పాటు చేసినట్లు నేతలు తెలిపారు. సాయిలును కేటీఆర్ పరామర్శించనున్నారు. ఎస్సై దీపక్ ఉన్నారు.



బాన్సువాడలో విద్యా సంస్థను బంద్ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



మద్నూర్‌లో కళాశాలను బంద్ చేయిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

విద్యా సంస్థల బంద్ విజయవంతం

సాక్షి నెట్‌వర్క్:విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతమైంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్‌ను పాటించాయి. విద్యా సంస్థల యాజమాన్యాలు ముందు రోజే అధికారికంగా సెలవు ప్రకటించడంతో విద్యార్థులు పాఠశాలలకు రాలేదు. బంద్‌కు పిలుపునిచ్చినా కొన్ని పాఠశాలలు, కళాశాలలు తెరవడంతో వాటిని దగ్గరుండి బంద్ చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, ఖాళీగా ఉన్న టీచర్స్, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



జుక్కల్‌లో .. ఎస్ఎఫ్ఐ నాయకులు



భిక్కనూరులో.. బీవీఎం నేతలు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో బుధవారం బీజేపీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలతోపాటు ఒక జెడ్పీటీసీ, 25 సర్పంచ్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్‌మోహన్‌రెడ్డి, హన్మాండ్లు, నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు దేవిసింగ్, కిషన్, నందు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సత్తా చాటాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ

మాచారెడ్డి/తాడ్వాయి(ఎల్లారెడ్డి): కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కలసి మెలిసి పనిచేసి స్థానిక సస్థల ఎన్నికలలో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ అన్నారు. తాడ్వాయి, మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లోకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఆంజనేయులు, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, జిల్లా నాయకులు లింగారావు, వెంకట్‌రావు, హోటల్‌శ్రీనివాస్, గంగారెడ్డి, సాయిరెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ



బిచ్కుంద సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార

బిచ్కుంద(జుక్కల్): జిల్లాలో అన్ని మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని, కార్యకర్తలు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార పిలుపునిచ్చారు. బుధవారం బిచ్కుందలో కార్యకర్తలు, నాయకులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలను చూసి విసిగి పోయారన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. నేతలు విష్ణు, రాములు సేట్, అరుణ్, విఠల్, పండరి పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ/బాన్సువాడ రూరల్: మండలంలోని ప్రతి గ్రామంలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని మండల అధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాన్సువాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. నాయకులు ప్రభారి చీదర సాయిలు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, దర్జీ మహేష్, దత్తు, నాగరాజు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని మండల బీజేపీ అధ్యక్షుడు హన్మాండ్లు అన్నారు. బుధవారం మండలంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు మోహన్ రెడ్డి, వడ్ల సతీష్, లక్ష్మణ్, శేఖర్, నాగరాజు, దత్తు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగును పెంచాలి



కామారెడ్డి క్రైం: ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్ సరోజినీ దేవి బుధవారం జిల్లాకు విచ్చేశారు. ముందుగా ఆమె కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఉద్యాన వన శాఖ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై సమీక్షించారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్స్, డ్రిప్ ఇరిగేషన్ పథకాల అమలు ఏవిధంగా ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గుచూపేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

అలంకరణ సామగ్రి పంపిణీ

మాచారెడ్డి: కామారెడ్డి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త విశ్వనాథుల రాజేందర్ పాల్వంచ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు రూ.లక్ష విలువైన అలంకరణ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. అడగ్గానే 200 మంది విద్యార్థినులకు అలంకరణ సామగ్రి పంపిణీ చేసిన రాజేందర్ అభినందనీయుడని కొనియాడారు. ఉపాధ్యాయులు బాల్‌రాజు, మల్లేశం, విద్యార్థినుల తల్లిదండ్రులు ఉన్నారు.

మానవ హక్కులను కాపాడాలి

మాచారెడ్డి: ప్రతి ఒక్కరూ మానవ హక్కులను కాపాడాలని మానవహక్కుల పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ సలీం అన్నారు. బుధవారం మానవహక్కులను పరిరక్షించాలని కోరుతూ మాచారెడ్డి ఎస్సై అనిల్‌కు వినతిపత్రం అంజేశారు. న్యాయవాది శ్రీనివాస్ రావ్, ప్రతినిధులు లింబాద్రి, ఉన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు 25 కుర్చీలను అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఈ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంతో పాటు, మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి అకస్మికంగా తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎరువుల నిల్వలు పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా స్టాక్ బోర్డులో రోజువారీగా స్టాక్ అప్డేట్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. రైతులకు ఎరువుల క్రయవిక్రయాలు ఈ–పాస్ మెషీన్ ద్వారా చేయాలని డీలర్లకు సూచించారు. అధికారులు అపర్ణ, పవన్ తదితరులున్నారు.



జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



ఇందల్వాయి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. గన్నారం గ్రామానికి చెందిన యావరశెట్టి గంగనర్సయ్య(60) పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులు ముగించుకొని టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత ..

రెంజల్(బోధన్): రెంజల్ గ్రామానికి చెందిన వివాహిత చికిత్స పొందుతూ బుధవారం ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన బేగరి సింధూజ (28) మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు సేవించింది. గమనించిన భర్త రవితోపాటు చుట్టుపక్కల వారు నిజామాబాద్‌లో ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సింధూజ పరిస్థితి విషమించి బు.ధ వారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మానసిక పరిస్థితి బాగోలేక కొంతకాలంగా చని పోతానని చెప్తుండేదని, కుటుంబీకులు కౌన్సెలింగ్ నిర్వహించినా ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



సింధూజ (ఫైల్)

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



అభినయ్ (ఫైల్)

మాక్లూర్: బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గంగరమందలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగరమంద గ్రామానికి చెందిన ధాత్రిక అభినయ్(20) చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. తల్లి జమున అభినయ్‌ను తన తల్లి చంద్ర వద్ద వదిలేసి మరో వివాహం చేసుకుని వెళ్లిపోయింది. అమ్మమ్మే అన్నీ తానై అభినయ్‌ను పెంచింది. ఇంటర్ పూర్తి చేసిన అభినయ్.. ఆ తర్వాత చదువు మానేసి కూలి పనులకు వెళ్లేవాడు. ఇటీవల బైక్ కొనివ్వాలని అమ్మమ్మను కోరాడు. పేదరికంలో ఉన్నామని, అంత డబ్బు మనవద్దలేదని చెప్పడంతో మనస్తాపానికి గురైన అభినయ్ మంగళవారం సాయంత్రం నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అమ్మమ్మ ఆందోళనకు గురై వెతుకుతుండగా అదే రోజు రాత్రి సుమారు 9 గంటల సమయంలో గ్రామశివారులోని హన్మాన్ మందిరం వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించారు. అమ్మమ్మ చంద్ర ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం గొలుసు ఎత్తుకెళ్లారని ఎస్సై రామకృష్ణ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పిట్ల నర్సవ్వ గిర్ని చౌరస్తా వద్ద బస్సు దిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నది. వెనుక నుంచి బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: అటవీశాఖ అధికారిపై దాడికి యత్నించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై–2 సుబ్రహ్మణ్య చారి తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డి కట్టకింది తండాకు చెందిన కోల మోహన్ అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌తో అటవీ భూమిని చదును చేస్తుండగా వెల్లుట్ల బీట్ ఆఫీసర్ షేక్ ఆసిఫ్ అడ్డుకున్నారు. దీంతో మోహన్, అతడి భార్య దస్లీబాయి, కుమారుడు అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు ఆసిఫ్‌పై దాడికి యత్నించినట్లు తెలిపారు. ఆసిఫ్ ఫిర్యాదు మేరకు మోహన్‌తోపాటు అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామన్నారు.



నిజామాబాద్ జిల్లాలోని మంచిప్ప నుంచి కామారెడ్డి జిల్లా గాంధారికి వెళ్లే మార్గంలో గల గుట్టల్లో సాగవుతున్న పంటలు కనుచూపు మేర పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. కొండలు, గుట్టలు నమ్ముకొని గిరిజనులు వ్యవసాయం చేస్తున్నారు. యాచారం తండా వద్ద సాగవుతున్న మొక్కజొన్న, పత్తి పంటలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మొక్కల రక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పాఠశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: మొక్కల సంరక్షణ మనందరి బాధ్యతని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మొక్కల సంరక్షణ బాధ్యతను స్వీకరించాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని సూచించారు. డీఈవో రాజు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎంఈవో ఎల్లయ్య, కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, కాంప్లెక్స్ హెచ్ఎం గంగా కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యోగ భవన్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్న రెడ్డిపేట్ తండా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగావత్ సందీప్‌ను సన్మానించారు. డీఏవో మోహన్ రెడ్డి, యోగ పరిషత్ అధ్యక్షులు రామ్‌రెడ్డి, కార్యదర్శి రఘుకుమార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని యువత ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన టి–గేట్ సమావేశంలో మాట్లాడారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను ఏర్పాటు చేసిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాటిని మార్పు చేసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లుగా మారుస్తోందన్నారు. తాజాగా టి–గేట్ విధానాన్ని తీసుకువచ్చి ఏటీసీ ప్రాంగణ నియామకాల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ఈ ఏటీసీ కేంద్రాలు ఎల్లారెడ్డి, బిచ్కుంద, తాడ్వాయిలలో ఉన్నాయన్నారు. వాటిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనిపై క్షేత్ర స్థాయిలో యువతకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సేవలందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- దేవునిపల్లి పీహెచ్‌సీ తనిఖీ
- అందుబాటులో లేని డిప్యూటీ డీఎంహెచ్‌వో, మెడికల్ ఆఫీసర్
- వారికి షోకాజ్ నోటీసులివ్వాలని డీఎంహెచ్‌వోకు ఆదేశం



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం ఆయన దేవునిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు.ఆ సమయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, మెడికల్ ఆఫీసర్ జోహా ముజీబ్ అందుబాటులో లేరు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇద్దరికి షోకాజ్ నోటీస్‌లు ఇవ్వాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు, ఆస్పత్రిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు.

నోటీసులిచ్చినా మారని వైద్యులు..

దేవునిపల్లి పీహెచ్‌సీలో వైద్యుల తీరు మారడం లేదు. గతంలో సైతం పలువురు వైద్యులు విధులకు హాజరుకాకపోవడంతో పాటు ముందస్తుగా సంతకాలు చేసి దుమ్మాలు కొట్టిన ఉదంతాలున్నాయి. దానిపై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో విచారణ చేపట్టి నోటీసులు సైతం ఇచ్చారు. అయినా వైద్యుల తీరులో మార్పు రాలేదు. రెగ్యులర్‌గా మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు అందుబాటులో ఉండరని, ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంటారని ఆరోపణలున్నాయి. విధులకు సక్రమంగా హాజరు కాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డీసీసీబీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి



రెండో అంతస్తును ప్రారంభించిన రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో ఇటీవల నిర్మించిన రెండో అంతస్తును రమేశ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు నిధులు సుమారు రూ.కోటీ 40లక్షల వ్యయంతో సకల వసతులతో కూడిన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. బ్యాంకులో సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగులు, సిబ్బంది మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. గడిచిన ఏడాది కాలంలో బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ స్టేట్ చైర్మన్ మార గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు, సీఈవో నాగభూషణం వందే, డీసీవో శ్రీనివాస్‌రావు, టీజీసీఏబీ జనరల్ మేనేజర్ సురేశ్, జీఎం లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

కన్నాపూర్ తండాలో చిరుత సంచారం

- ఆవుపై దాడి
- దాడి చేసింది చిరుత పులేనని అధికారుల నిర్ధారణ



విచారణ చేస్తున్న అటవీ శాఖాధికారులు



చిరుత దాడిలో మృతి చెందిన ఆవు

రామారెడ్డి: అదిగో పులి అంటే ఇదిగో ఇక్కడే ఉంది అన్న చందంగా పెద్దపులి సంచారంపై రామారెడ్డి మండలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. నిజానికి 9 రోజుల క్రితం స్కూల్ తండా ప్రాంతంలో మాత్రమే పెద్దపులి కనిపించింది. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులు పులి ఆచూకీ కోసం ట్రాక్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. మండలంలో ఎక్కడ ఏ జంతువు కనిపించినా అది పెద్దపులి అని ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. దీనిపై ఎప్పటికప్పుడు అటవీ శాఖ అధికారులు వివరణ ఇస్తున్నా సోషల్ మీడియాలో ప్రచారం మాత్రం ఆగడం లేదు. అన్నారం గ్రామంలో పులి సంచారంపై ప్రచారం జరిగింది. ఆ తర్వాత గోకుల్ తండాలో ఆవుపై చిరుత పులి దాడి చేస్తే పెద్ద పులే దాడి చేసిందని ప్రచారం జరిగింది. తాజాగా రామారెడ్డి మండలం కన్నాపూర్ తండా శివారులోని కాట్రోత్ రమేష్ మంగళవారం సాయంత్రం 7 గంటలకు వ్యవసాయ పని ముగించుకుని తన ఆవు దూడను చేను వద్ద కట్టేసి వెళ్లాడు. బుధవారం ఉదయం 6 గంటలకు వెళ్లి చూసేటప్పటికి దూడ అక్కడ కనిపించకపోవడంతో వెతికాడు. చివరికి బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో దూడ చనిపోయిన స్థితిలో కనిపించింది. దాన్ని పెద్ద పులి తిన్నట్లు ప్రచారం జరిగినప్పటికీ ఆ వ్యక్తి చిరుత పులి దాడి చేసిందని అటవీ శాఖ అధికారులకు తెలిపాడు. అటవీశాఖ అధికారులు కూడా దీన్ని నిర్ధారించారు. పులులు ఎక్కువగా గుహల్లో తల దాచుకుంటాయని మండలంలోని సింగరాయపల్లి, అన్నారం గుహల్లో ఆపరేషన్ కొనసాగుతుందని మాచారెడ్డి ఎఫ్ఆర్‌వో దివ్య తెలిపారు.